"ఉషారాణి!" అన్నాను, సమీపిస్తో!

"అమ్మా, ఇంకోడు వొచ్చాడు."

అని ఒకామె వెనకాలికి వెళ్ళింది. జానకి తాడు తెంపుకుని నా మీదికి దూకింది.

"జాగ్రత్త. జానకి పళ్ళు చాలా నాజూకు. కాలు కదల్చకు." అంటోంది తార.

జానకి వెనకా, నేను ముందూ రోడ్డుమీద పడ్డాము.

★

హంకో మహబత్

"అట్లా అంటావు. నీమీద నాకు ప్రేమ అని తెలిదా?"

అంది సోహన్ కుమారి.

ఆమె పక్కన ఖరీదుగల మాట్రెస్‌మీద పెద్ద ఎలక్ట్రిక్ పంకా కింద పడుకుని కులాసాగా కబుర్లు చెపుతున్న చక్రధర్రావు వీపున తేలు కుట్టినట్టు ఒక్క అరుపు అరచి మంచంమీదనుంచి దూకి దూరంగా పడ్డాడు. ఇంకా దూరంగా పడేవాడే. ఎలక్ట్రిక్ దీపాల్లో మెరిసే రంగూన్ కలప తలుపులు పెద్ద ఇనపగడియతో లోపల బిగించి వున్నాయి. తెల్లారే లోపల వాటిని తెరవవలసిన అవసరం రాదు. ఎందుకంటే పంజాబునుంచి సౌహన్ కుమారిని తన భార్య అంటో తెచ్చుకున్న భాటియా రాత్రులు ఎప్పుడూ ఇంటికి తిరిగిరాడు. వెళ్లాడంటే పదిరోజులదాకా మళ్ళీ ఇంటికి

రాడు. అందుకని ఆమె కిందభాగంనించి సాయంత్రం ఎప్పుడు చీకటి పడుతుందా అని కాచుకుని కాచుకుని రోడ్డుదీపాల వెలుతురు తప్పుకుంటో పైకి వొచ్చిందంటే మళ్ళీ సూర్యుడి వెలుతురు భయపెట్టిందాకా కిందికి పోనక్కర్లేదు.

చక్రధరరావుకి పెళ్లి కాలేదు. మేడమీద బ్రహ్మచారి కాపరం. కాని అతని flat చూస్తే ఆ పెద్ద మంచం, toilet సామానులు, తువ్వాళ్ళు, సగం బట్టలున్న స్త్రీల పటాలూ, వెండి సామానులు చూస్తే ఎవరూ అతనిది వొంటరిబతుకేమోనని సందేహించరు.

మూడేళ్ళకింద తను పెట్టుబడి పెట్టి పదివేల రూపాయలూ యుద్ధ కాలంలో తన తెలివితేటలుగాని, ప్రయోజకత్వంగాని ఏమీ లేకుండా చూస్తుండగా పదిరెట్లూ ఇరవైరెట్లూ కావడం అతను గమనించి ఆ flat లో ఆ స్ప్రింగు మాట్రెస్‌మీద చాలా స్త్రీ రూపాల్ని పడుకోపెట్టి చాలా ఎక్స్పెరిమెంట్లు చేశాడు. గడిచిన రెండు నెలలనుంచీ సోహన్ కుమారి అందంతో తన గదికి వొచ్చిన కొత్త వైభవాన్ని గమనిస్తున్నాడు. అదే మొదటిసారి ఆంధ్రేతర వనిత ఆ ఇంగ్లీషు స్ప్రింగుల వూపుని ఆనందించడం. డబ్బు నిండింతరవాత ఆగదిలోనే కాదు, చక్రధర్లో మనిషిలో ఇదివరకు కనపడని కొత్త సామర్థ్యాలూ అందాలూ కనపడుతున్నాయి, ఆ చుట్టుపక్కల వీధుల పురంధ్రీమణులకి. అతని ప్రయత్నమూ వుంది దాంటో. తన శరీరాన్ని తయారుచేసుకునేందుకు గంటన్నర బట్టల అలంకారం, అతను రోడ్డుమీద నడుస్తో వుంటే రూపాయి ఇచ్చి సరిదిద్దించిన కోరమీసం. ఇటూ అటూ గుండెల్లో గుచ్చుకుంటోంది. బుడ్డి ఎనిమిది రూపాయలకు కొని పూసుకున్న పారిన్ స్నో, నున్నగా రోజుకి మూడు సార్లు క్షవరం చేసుకునే చంపల్నించి పరిమళాల్ని, తళతళల్ని రోడ్డు దుమ్ముని చీల్చుకుని సూటిగా చేరుకుంటోంది వీలైనచోటనల్లా. అతని వల్లెవాటు ఉత్తరీయం సన్నదనం, నాజూకైన జరీ అంచూ, అట్లాంటి చీరెలు అతనిదగ్గిర వుండకపోవని సూచిస్తుంది. అంతేగాక అతని గది వైభవకీర్తి వ్యాపిస్తోంది. స్ఫోటకంకన్న చాలా వేగంగా. ఎవరూ ఆ గదిని

చూశామని చెప్పినవారు లేరు; విన్నామనేవారే స్త్రీలు. కాని ఆ కీర్తికి పరవశులయ్యేవారు వారే. అతను వొక లెజండ్ ఐనాడు. అతను చాలా మితాభిలాషి. అప్పియ్యడు గాని, మిత్రుడు అన్నవాడిమీద కులాసాగా మూడు రూపాయలు ఖర్చుచేస్తాడు వుత్త కాఫీకని. కాని సాయంత్రం అయిందా అతని మేడమీదికి ఏమిత్రుడు రావడమూ అశక్యం. ఎందుకంటే మేడమెట్ల తలుపుకి బైట పెట్టిన ఇత్తడి తాళం రోడ్డు దీపం వెలుతురులో మెరుస్తో చాలా దూరానికి కనపడుతో వుంటుంది. మేడమీద లైట్లు వెలుగుతున్నాయేం? అని ప్రశ్నిస్తే, దొంగలు రాకుండా అంటాడు చక్రధర్.

రాత్రులు దీపాలకింద అతని గది అందాన్ని చూడాలని కోరే అబలా అర్జీల్ని చాలా వాటిని నిరాకరించవలసి వొస్తోంది అతను. బి.వి. నరసింహారావుగారి పాటని చక్రధర్ మిత్రుడు—కొంచెం చలం పేరడీ చేసి పాడుతున్నాడు. అతని బుజాన వున్నది బ్లూరంగు బుష్‌కోటు.

* * * *

అతని మాట్రసుమీద ఊగినా చాలూ....అని.

చక్రధర్ అన్ని విధాలా పెళ్ళికి తగిన మనిషి. రూపం, చమత్కారం, మిత్రత్వం, ధనం చాలా వలలు వేశారు మామలు. కాని అతని ధనాదాయానికి ప్రపోర్షన్‌గా స్త్రీ ఆదాయంకూడా పెరిగింది. పెళ్ళి చాలా అనవసరమయింది. ఎవరన్నా పెళ్ళి లేదేమని అడిగితే, ఇది గాంధియుగమనిన్నీ, గాంధీగారు పెళ్ళి చేసుకున్నా కామంతో- ఎవర్ని చూసినా-భార్యని చూడవద్దన్నారనీ, ఈ కాలంలో రాజ్యపద్ధతులన్నీ గాంధీ ఆశయాలమీద నడుస్తున్నాయని తన మామలు గ్రహించాలనీ, ఓ కన్యని నామమాత్రం పెళ్ళిచేసుకుని గాంధీగారి పేర కష్టపెట్టడం ఇష్టంలేదని చెప్పేవాడు. ఇంకా మాట్లాడితే గట్టిగా వాదించి ప్రస్తుత ప్రభుత్వాధికారుల్ని ఆదర్శంగా చూపాడు.

"చూశారా! గాంధీ ఆశయాల ప్రకారం, నల్లమందు మీదా, సిగరెట్ల మీదా ఆంక్షలు పెట్టారు. జమీలు రద్దుచేశారు. హరిజనోద్ధరణ చేశారు.

శాసనాలు చెయ్యడమేకాదు, తమ స్వంత జీవితంలో కూడా ఆ ఆజ్ఞనే
పాలిస్తున్నారు. పగలు ఖద్దరు ధరిస్తున్నారు. ఎవరన్నా చూడవొస్తే
వొడుకుతున్నారు. అట్లాంటి వారు వివాహవిషయంలో మాత్రం గురుద్రోహు
లౌతున్నారంటే నేను వొప్పుకోను. భార్యల్ని మాతృసమానులుగా చూస్తు
న్నారని ఘంటాపథంగా చెప్పగలను. భార్యల్ని మాత్రమే నంటారా?
కావొచ్చు. అంతవరకే గాంధిగారు చెప్పింది. ఆశయాన్ని ఆ మాత్రం
నిలుపుకుంటే చాలు. గాంధిగారు ఒక్క కొడుకునే వొప్పుకొన్నారా? వీళ్ళూ
అంతే. ఎక్కువమంది ఎవరికన్నా వుంటే ఆ పిల్లలకు ఆ కాంగ్రెసు భర్తలే
బాధ్యులనడం చాలా దుర్మార్గం. వుత్త వోర్చలేని స్కాండల్. "ఏ నిషా,
చివరికి బీడీనిషా కూడా సహించని ప్రభుత్వం, కామ నిషాకి లొంగిందనడం
చాలా తప్పు, తమ భార్యలతో ముఖ్యం."

సోహన్ కుమారితో స్నేహమైన తరవాత కొంత ఒక పద్ధతిలోకి
వొచ్చాడు చక్రధర్. ఎందుకంటే, ఆమె చాలా అందం. ఆమె మాటతీరులో
కొత్తదనం, నాజూకు. ఆమెని భాటియా తన భార్య అంటున్నా, ఆమె
అతని భార్య కాదని తెలుసు చక్రధర్‌కి. అందువల్ల వాళ్ళమధ్య సంబంధం
ప్రేమ అని పొరపడ్డాడు ముందు ముందు. పైగా కిందభాగంలో కాపర
మున్న సోహన్ మొదట్లో అతన్ని బిగ్గిరిగానే తిట్టిపోసేది. తన నెత్తిమీద
చాలా అక్రమాలు జరుగుతున్నాయని. ఆమె తిట్లని వినడమే గాని ఆమెని
ఎప్పుడూ చూడలేదు అతను. ఆమె తిడుతోవుంటే పంజాబీ భాషలో ఆమె
కంఠాన్ని ఆ ఉచ్చారణ అందాన్ని ఒక కళనివలె అనుభవిస్తో నుంచునే
వాడు. ఆమె భర్త ఊళ్ళో ఉన్నప్పుడైనా ఏ అర్ధరాత్రికో గాని రాడు.
అంతవరకూ ఆమె కిటికీలో కూచుని మెట్లమీది నుంచి ఎవరు పైకి వెడు
తున్నారో కని పెడుతోనే వుండేది. ఆవేళ వాళ్ళని ఏదో బూతుమాట అనక
వొదిలేది కాదు. ఆమె కంఠ స్వరం అంత శ్రావ్యంగా లేకపోతే ఎన్నడో
పెద్ద తగాదా జరిగేది. చక్రధర్‌కీ భాటియాకీ. అందం ఒక్క సారస్వతం
లోనే కాదు. అంతకన్న ఎక్కువగా జీవితంలో చాల కల్మషాల్ని తుడి
చేస్తుంది.

ఓ రోజున చిన్నప్పటి ప్రియమిత్రుడు ప్రస్తుతం ఆంధ్రావనీంద్ర కవికుంజర సూరిపాటి కాంతారాయ భట్టాచార్యులు తటస్థించాడు అతనికి. మధ్యాహ్నం మూడింటికి నడిబజారులో వున్న చక్రధర్ కొట్టులో మోగే టెలిఫోన్ పిలుపులమధ్య బేరాల కొచ్చే వర్తకుల మాటల సందుల్లో, తన చరిత్రా కవిత్వమూ తనకి జరిగిన సన్మాన గౌరవాలూ, ప్రస్తుత స్వతంత్ర సందిగ్ధ సమయంతో దేశానికి తాను ఎంత అవసరమో ముక్కలు ముక్కలుగా వినిపిస్తున్నాడు. ఆ కవిమిత్రుణ్ణి వొదుల్చుకోవాలనే అవసరం వల్ల కొట్టుని అయిదింటికే మూసి చక్రధర్ బైలుదేరాడు. కవి వదలలేదు. కవిని కాఫీహోటల్‌కి తీసుకుని వెళ్ళి మూడు రూపాయలు ఖర్చుచేశాడు. భోజనంతో కవి కవితాశక్తి విజృంభించింది. కీలుగుర్రం ప్రాశస్త్యం వర్ణిస్తున్నాడు. ఆ చిత్రంలో తన వర్ణనలు కొన్ని దొంగిలించారట. వాటిని కనిపెట్టి దావాచెయ్యాలన్నాడు. కనక మనం వెళ్ళి చూడాలన్నాడు. ఆ సినిమా అపాయంనించి తప్పించుకోడానికి చక్రధర్ తనకి తలనొప్పిగా వుందని ఇంటికి పోయి పడుకొంటా నన్నాడు. సరే ఇంకేం తీరికగా కవిత్వం వినిపిస్తానన్నాడు కవి. ఇంకెవరినన్నా ఐతే కసిరికొట్టి పంపేవాడే. కాని కాంతారాయుడు చక్రధర్‌కి మూడోఫారంలో జాగ్రఫీలో కాపీ ఇచ్చి దజను దెబ్బలు తిన్నాడు. ఫుట్‌బాలులో సెన్‌టరుగా ప్రసిద్ధికెక్కి చక్రధర్‌కి ఆరాధ్యనాయకుడైనాడు. అందుకని ఏమీ చెప్పలేక తల వంచుకున్నాడు ఈనాడు.

అసలు అతని కవిత్వ ధోరణివల్ల చక్రధర్‌కి తలనొప్పి వొచ్చిన మాట నిజమే. కాని అంతకన్న పెద్ద కారణం వుంది. దుర్గకి రాత్రి తొమ్మిదిన్నర వరకే విడుదల. అది దాటిందా ఆమె భర్త సినిమానించి ఇంటికి వొస్తాడు. ఆమె భర్తకి అసలు ఉద్యోగంకాక, అతను స్వయంగా ఆర్డరు వేసుకున్న ఉద్యోగం వుంది. అది సాయింత్రం ఐదింటినించి రాత్రి తొమ్మిదింటివరకూ పరంజ్యోతి టాకీసులో బైట కుర్చీలో కూచుని చుట్టుప్రక్కల వాళ్ళతో కబుర్లు చెప్పడం, జనసమర్దమైనప్పుడు టిక్కెట్లు అమ్మడం, గేటుకాయడం, ఆ వుద్యోగం తనని చెయ్యనిచ్చినందుకు సినిమా యజమాని గోవిందుకి ఆజన్మాంత కృతజ్ఞతా బద్ధుడై, పలహారాలు

పంపడం, చేబదుళ్ళు ఇవ్వడం మొదలైన సహాయాలతో కొంత ఋణం తీర్చుకుంటూ వుంటాడు. దుర్గకి ఆ గంటకే విడుదల. కాని ఇంటినిండా మనుషులు. అత్త, మరదలు, వొదినలు, చిల్లర వితంతువులు. ఆమె ఆవిడి గంటలలో తన ప్రియ బంధువుల ప్రేమను తప్పించుకుని, వూపిరి పీల్చుకోడానికి సోహన్ కుమారి ఇంటికి వొస్తోవుంటుంది గాంధిగారి బోధనల వల్ల దుర్గ బాగా హిందీ నేర్చుకోడం వల్లనే సోహన్ కుమారితో స్నేహం. తద్వారా చక్రధర్ గది ప్రవేశం కలిగాయి. ఎంత పవిత్రమైన ప్రారంభాలు ఎంత అపభ్రంశపు పర్యవసానాలికి కారణాలో నీతివేత్తలు గ్రహించరు ఏనాటికీ. అందులో హిందీలో దుర్గకి అభిమాన గ్రంథం తులసీదాసు రామాయణం.

అదృష్టవంతుడైన చక్రధర్‌కి కూడా శృంగారం సులభంగా లభించదు. డబ్బు సంపాయించడానికన్న స్త్రీని సంపాయించడానికి ఎక్కువ శ్రమపడతాడు. అతని నడకలో మాటలో కొంచెంగా ఆడతనం వుండడం వల్ల, బాలరాజుని చూసి చొంగలుకారే జాతిస్త్రీలకి వెర్రు లెత్తించడమే గాక, ఏ ఇంటి ముసలమ్మలతోనూ పసిపిల్లలతోనూ సులభంగా పరిచయం ఏర్పడుతుంది. మాటలో చాతుర్యం, ప్రియత్వం ముఖంలో అమాయకత్వం అతనికి చాలా సహాయకారులైనాయి దుర్గకోసం ఆ ఇంటి ముసలమ్మలిద్దరికి దగ్గుమాత్రలు మంచివి తెచ్చిపెట్టాడు. దుర్గ మేనకోడళ్ళకి రిబ్బన్లూ సైడు క్లిప్పులూ కొని పెట్టాడు. నవీన వాత్స్యాయన సూత్రాలలో స్త్రీ వశ్యంకోసం ముసలమ్మ ప్రసన్నత ఎక్కువ లాభసాటా, లేక పసిపిల్లల చిరునవ్వులా అనే విషయం ఇంకా చర్చనీయంగానే వుండిపోయింది. తనకి కావలసిన స్త్రీతో రెండు మాటలు మాట్లాడాడా చక్రధర్ సులభంగా, "మా ఇంటికి రావా ఓసారి?" అంటాడు. తనకేం రావాలని గట్టిగా లేనట్టే. తక్కిన సదుపాయాలన్నీ త్వరలోనే మాట్లాడుకుంటారు. దుర్గకి సదుపాయం సోహన్ కుమారితో స్నేహం. ఆమెతో మాట్లాడుతో, ఇంటికి వెడతానని బైటికి వొచ్చి (గోషా గనక సోహన్ బైటికి రాదు) ప్రక్కనున్న మెట్లమీదనించి మేడమీదికి వెళ్ళడం, అట్టే కష్టంకాదు, ఆ ప్రక్కగా మునిసిపల్ దీపమే లేకపోతే.

దుర్గ ఈవిధంగా పైకివెళ్ళడం సోహన్ కుమారికి తెలిసిందని ఇంకా చక్రధర్‌కి తెలీదు. దుర్గ చెప్పలేదు. చెపితే, చిరాకుపడి తనని రావొద్దంటాడే మోనని భయం దుర్గకి. సోహన్ కుమారి పతివ్రతాగ్రహాన్ని తట్టుకోలేకుండా వుంది దుర్గ. అవిధమైన స్త్రీలకి వుండేట్టే సోహన్ కుమారికి నీతిపట్లు ఎక్కువ, భర్తకి బద్ధులైన స్త్రీలకన్న ప్రియులకి బద్ధులైన స్త్రీలలో పాతివ్రత్యం నిరంతరం జ్వలిస్తూవుంటుంది. ఆ గర్వం లేంది తమ జీవితపు నిరంత రావమానాన్ని భరించలేరు. కాని దుర్గ సోహన్ కుమారి సక్రమమైన పంజాబీ ఇల్లాలే అనుకుంటోంది.

సాయంత్రత మైన తరువాత తన మేడ మీద పురుషుడు వుండ కూడదనే నియమం భగ్న మయింది చక్రధరరావుకి. పక్కమీదనించి లేచి ఆ కవిని కిందికి గిరాటువెయ్యడం తప్ప వేరే గత్యంతరం కనపడలేదు. అది అసలే వీల్లేదు. కవి మరచివస్తాడు కూడా. కవిని ఎంత వుడికిద్దామని వాదన పెట్టుకున్నా తొణకటంలేదు అతను. పోనీ ఏమన్నా లంచం పెడితే! కాని కవిత్వ సాధనలో ధనాన్ని బూడిదకన్న తేలికగా నెట్టేశారన్న పురాతన సత్యం నవీనకాలంలో కూడా సజీవంగానే వుందని తెలీదు చక్రధర్‌కి. కవితాకన్య కౌగిలి వదిలింతరవాతగాని తిండికీ, డబ్బుకీ దేవులాడరు. ఏ కవి కూడా తన కావ్యాన్ని వినే రసికులు దొరికితే మూడు రోజులు ఆహ్లాదంగా ఉపవాసం చేస్తాడు పాపం. ఎక్కడి కక్క డికి ఖండిస్తున్నాడు మిత్రుణ్ణి చక్రధర్, లేచిపోతాడేమోననే ఆశతో. ఏడున్నరయిందా వొచ్చేస్తుంది దుర్గ. నల్లని పెద్ద కళ్ళు ఎలక్ట్రిక్ దీపాలు తొడలమీద ప్రతిఫలించే దుర్గ. ఆ భర్తవల్ల ఇన్నేళ్ళలో ఒక సారైనా మానభంగాన్నెరగదనిపించే దుర్గ.

"ఇట తెలుగు వీరుల రక్త మేరులై పారెను,

ఇట తెలుగు కవుల వెలుగు వెలిగె,

చూడరా తమ్ముడా చూరులో తలపెట్టి

తాటాకు గ్రంథముల్ దాచినారు.

తెలుగు కత్తుల వేడి తేజరిల్లెడు కాంతి,

తేనీటివలె నీకు తెల్లమయ్యె."

అని చదువుతున్నాడు కాంతారాయుడు.

బైట రేడియోలో

"ఎత్తరా తెలుగు జండా,

పాడరా తెలుగు గీతాల్,

కొట్టరా తెలుగు ఢంకా

మొక్కరా ఆంధ్రమాతకు

తమ్ముడా!"

అని పాడుతున్నారు.

లేని ఉగ్రం తెచ్చుకుంటో చివాలున స్ప్రింగ్ మంచం మీద ఒక్క ఎగురు ఎగిరి వూగి, "ఎవరా ఆంధ్రమాత! ఎక్కడ వుంది అది?"

అని రెండు బూతులతో ముగించి, హిరణ్యకశిపుడిమల్లే మండి పడుతో ధిక్కరించాడు చక్రధర్.

"ఎవరేమిటి? ఎక్కడ వుంటుంది! మన కన్నతల్లి మన పుట్టిన పుణ్యభూమి...."

"నేను విజ్లపురంలో పుట్టాను."

"ఎక్కడ పుడితేనేం?"

"సరేలే, ఈ మట్టి మనిషెట్టా అవుతుంది?"

"మనిషి కాదు, దేవత."

"ఏం దేవత? ఎక్కడ వుంది ఆ దేవత? కొత్తదేవతలు పుడతారా? పాకిస్తాన్ మాత ఎక్కడ వుంది? సిగ్గులేదూ? భరతమాత, రష్యా పిత, చైనా తాత, పరిషియా భ్రాత, అమెరికా మామ, పెరూ మరదలు.... ఏనాటికైనా ఏ ముందు యుగంలోనైనా నవ్వుకోరా, ఆ స్థితికి రారా, మట్టిని పట్టుకుని మాతలని గంతులేసిన కాలాన్ని చూసి. నిజంగా చెప్పు ఈ పాటలూ పద్యాలకేంగాని- ఆ మట్టి నీకు తల్లి అనిపించిందా?"

"అదేమిటి అట్లా అంటావు?"

"ఎవడో ఎప్పుడో రాళ్ళు చెక్కాడా? యుద్ధంలో చచ్చాడా? పుస్తకం రాయించాడా? ఏది మహావిషయం? తిని కూచుని అంతకన్న ఏంచేస్తారు? పొద్దు పోవొద్దూ. పైగా అవన్నీ జాబితాలుగా పద్యాలలో పాటల్లో ఏకరు పెడతారా? లేవరా ఆంధ్రుడా! పడుకోవే ఆంధ్రీ! అనుకుంటో.

"మరి ఆంధ్రజాతి...."

"జాతి, జాతి! ఏం మనుషులైనాక ఏదో ఓ భాషవుండదూ? ఎక్కడో ఓ చోట పుట్టరూ? ఏదో ఓ తిండి తినరూ? ఏదో మాతట వీళ్ళకి స్తన్యం ఇస్తోందిట. వాళ్ళో వుయ్యాల లూపుతోందిట. ఏడుస్తుందిట, ఏమి చేమిటో పాతకాలాన్ని తలుచుకుని. వున్న మనుషులు చాలరూ ఏడవ డానికి? లేని మాతల్నీ అక్కల్నీ కల్పించుకుని ఆ ఏడుపులు ఎంతమంది కవులు కలిసి రేడియోల నిండా గ్రామఫోనుల నిండా ఏడ్చేది చాలక ఇట్లా కనపడ్డ వాణ్నల్లా పట్టుకుని బాధించాలా? వున్న ఏడుపులు చాలవూ? ఏమిటా?

లేవరా ఆంధ్రుడా!

ఎవరి మీదకిరా ఆ లేవడం! లేచమను, పక్కలు విరగ తంతారు. ఎవరిమీదికోయ్! అరవ్వాళ మీదికేనా? ఎందుకు? వాళ్ళు అరవం మాట్లాడ తారు గనక నా? వాళ్ళు నీదంతా దోచుకుంటున్నారా? అదేదో రాయరాదూ పద్యాల్లో? ఈ వీరాలాపాలు, మాతస్మృతులు ఎందుకూ?

మా ఉద్యోగాల్ చేస్తున్నారోయ్!

మా చెన్నపట్నం కొట్టేశారోయ్!

మా వూళ్ళో హోటళ్ల పెట్టారోయ్

మాకో కడుపు మంటగా ఉందండోయ్.

లేవరా ఆంధ్రుడా!

తన్నరా తమిళ సోదరినీ! అని రాయి.

అసలే చస్తున్నాం. బాంబే మార్కెటు ధరలూ, అమ్మకం పన్నులూ ఆదాయం పన్నులూ జ్ఞాపకం పెట్టుకో లేక, అవి చాలక—

ఏమిటో పల్నాడు రాళ్ళట, ద్రాక్షారామంలో గుళ్ళట, గోల్కొండలో గోరీలుట, హంపీలో హర్మ్యాలుట, ఎవరో రాజులట, రెడ్లుట, కవులుట, ఈ పేర్లన్నీ మరవకండిరా అని అరుస్తాడు, వాడెవరో రేడియోలో - ఆ రేడియో ఒకటి. దాంట్లో ఒక్కడూ సరిగా మాట్లాడడు కదా! అన్నీ అడకులుకులు. దీర్ఘాలు. యాసలు ఆ కంఠాన్ని ఎక్కడ పట్టుకుని వాస్తారో! ఎక్కడా వినం అట్లాంటి అసహజమైన ఏడుపు దీర్ఘాల్ని. మళ్ళీ మంచి సంగీతం ఏదన్నా వినపడ్డదంటే అది అరవ వాళ్ళదే. పాపం వాళ్ళు నేర్చుకుని పాడుతూ వుండకపోతే మీ త్యాగరాజు ఏం రాశాడో మీకు జ్ఞాపకం వుండేదా! వాళ్ళు బాగా పాడిపోతున్నారని వాళ్ళని సాధించి సాధించి తెలుగు పాడకుండా చేశారా? త్యాగరాజు పేరునే ఎగర కొట్టేశారు వాళ్ళ పాటల్లోంచి. బాగా కుదిరింది, పాడు తున్నారు మనవాళ్ళు. మనకో సంగీతం కూడానా? అసలు మీరు కోతలు కోసి, స్తుతులు చేసుకునే ఆంధ్ర విఖ్యాతు లందరూ పరదేశాలు పోయి గొప్ప వాళ్ళయిన వాళ్లే. అసలు సగం కర్తీరకం. మీ త్యాగరాజూ, కృష్ణదేవరాయలూ, పోతన్నా. మీ మధ్య వుంటే వాళ్ళని వెక్కిరించి, వాళ్ళల్లో ఏంలేదని చప్పరించి, తిండి పెట్టక, వాళ్ళ విశ్వాసాన్ని చెడగొట్టి

వాళ్ళ గొప్పతనాన్ని వ్యక్తం కాకముందే నాశనం చేసే వాళ్ళు కాదూ! అజంతా గుహలుట; వీళ్ళవిట! నా మాట విని ఈ పద్యాలు మాను."

కాంతారాయుడికి వొళ్ళు మండిపోతోంది. కలం మాని కత్తిపడితేనే గాని తన మిత్రుడు నోరు ముయ్యడనుకున్నాడు. ఏమయ్యేదో మరి. ఆ నిమషానే లైట్లు ఆరిపోయినాయి. ఆ లైట్లు ఆ నిమషాన ఆరిపోకపోతే అస లీ కథ జరిగేదే కాదు. ఆ చీకట్లోనే చక్రధర్ గదిబైట చిన్న గోల జరిగింది. రెండు స్త్రీ కంఠాలు - మధురమైన కంఠాలు తగాదాలాడు తున్నాయి.

మామూలుగా దుర్గ సోహన్‌కుమారి గదికి వొచ్చింది ఆ సాయంత్రం. ఏడింటికి వెళ్ళడానికి లేచింది. సుతలామూ మేడమీదికి వెళ్ళ డానికి వీల్లేదని సోహన్ రోషంతో పోటాడుతోంది. దుర్గ నవ్వుతో ఆమె చేతిని వొదిలించుకుని మేడమెట్లెక్కింది. పరదావెనకనించి సోహన్ కుమారి కంఠం ఆమెని వెంబడించింది. స్త్రీ శరీరానికి గోషా కాని కంఠా లకి లేదు. ప్రాతివ్రత్యం కూడా అంతే. తన మిత్రురాలి అరుపులు విని భయపడి దుర్గ వెనక్కి తిరిగింది. ఆ సమయంలో లైట్లు పోయినాయి. ప్రపంచానికే గోషాపడ్డది. ఆ అదును చూసుకుని సోహన్ కుమారి మేడ మెట్లెక్కి దుర్గని వెనక్కి లాగుతోంది. దుర్గ వెనక్కి వొచ్చేదే! ఆ సమయంలోనే లోపల చక్రధర్.

"మరి వాళ్ళకంఠాలే అట్లావుంటాయో, లేక వాటి నట్లా మార్చే స్తారో...." అంటున్నాడు చీకట్లోనే.

చప్పున లైట్లు వెలిగాయి.

ఆ నిమిషంలో లైట్లు వెలక్కపోయినా ఇంకా ఒక స్త్రీ మర్మ చరిత్ర ఇంకోవిధంగా నడిచివుండును. మరి స్త్రీ శీలాన్ని పరలోకంలో విలువలు కట్టేప్పుడు ఈ విషయాల్ని ఎంతవరకు గమనింపులోకి తీసు కుంటారో. ఆ లైట్లకి గాని, తన ఉపేక్షవల్ల వాటిని ఆరిపోనిచ్చి, మళ్లా తొందరగా సరి చేసిన విద్యుచ్ఛక్తి ఉద్యోగస్తుడికి ఎంత భాగం బాధ్యత పంచిపెడతారో!

లైట్లు వెలిగేప్పటికి ఆ ఇద్దరు స్త్రీలూ మెట్లమీద బట్టబైలైనారు. ఆ కంఠాల శబ్దాలకి గావును రోడ్డుమీద కూడిన నలుగురు పధికుల దృష్టి ప్రసారంలో నిలిచివున్నారు. సోహన్ కుమారి కిందికి దిగడం అసంభవమై పోయింది. దుర్గని లాక్కుని చక్రధర్ వరండా నీడలోకి పరిగెత్తింది. ఆ నిముషానే వాళ్ళ కంఠాలు విని చక్రధర్ బైటికి వొచ్చి, దుర్గని చూసి వెంటనే లోపలికి లాగాడు. ఎందుకంటే అతని వరండాకింద అతని పూర్వపు ప్రియురాలు సూరమ్మ వుంది. ఎప్పుడూ ఆమెకళ్ళు అతని వరండావేపే. గదిలోకి దుర్గ ఓ పట్టాన రాలేదు. చాలా బరువుగా వొచ్చింది. ఎందుకంటే మిత్రురాళ్ళు ఒకరిచేతిని ఒకరు వదలలేదు. తన గాలానికి పడ్డ చేపవెంట అతుక్కుని ఇంకో చేప వొచ్చింది వలలోకి. కొత్తస్త్రీలు అకస్మాత్తుగా తన గదిలోకి రావడం కొత్తకానివాడు గనక చాలా నిదానంగా ఆహ్లాదంగా ఆతిధ్యం సలిపాడు చక్రధర్. కాని ఆ కొత్త కవిని చూసి ఆగడం ఇష్టంలేక దుర్గ లేచింది. కవిమీద లోపల మండిపడు తున్నాడు చక్రధర్. బైటనించి

"ఎత్తవోయి నీ జయజండా-"

అని వినబడుతో మరీ కోపం తెప్పిస్తోంది అతనికి. దుర్గతో వెళ్ళడానికి వీల్లేదు ఆమెనెచ్చెలికి. ఆ మెట్లు సప్త మహాసముద్రాల కన్న అగమ్యం ఆమెకి రోడ్డు సద్దుమణిగిందాకా. సూక్ష్మమైన అందాలు కనిపెట్ట గల కవి బుర్రలోకి అప్పటికి ఎక్కింది తన మిత్రుణ్ణి ఇబ్బంది పెడు తున్నానని. దుర్గవెళ్ళిన రెండు నిమిషాలకి అతనూ శలవుపుచ్చుకున్నాడు.

అందాలొలికే తన వింత విజిటర్ ఎవరో తెలీదు చక్రధర్‌కి. ఎందుకు వెళ్ళకండా వుండిపోయిందో కూడా తెలీదు. వలచి తనకోసం అందవతి వచ్చిందనీ నమ్మలేదు. వాళ్ళిద్దరూ వెళ్ళగానే ఆమెతో ఏం మాట్లాడాలో కూడా తెలీదు. Shelf లో వున్న ఫదర్ పేణీ, బహ దూర్‌షాల పళ్లాలు తెచ్చి ఆమె ముందు పెట్టాడు, బల్లమీద. ఆమెని కూచోమన్నాడు ఎదురు కుర్చీలో. ఆమె ఏమిటో గొణిగింది. అతనికి

వినపడనూలేదు. అర్థమూ కాలేదు. తినమని బలవంతంచేశాడు. ఆమె కదల లేదు. నేలకేసి చూస్తో నుంచుంది.

"అయితే, ఇంక నేనే కూచో పెడతాను నిన్ను."

ఆ మాటకి దూరంగా జరిగి వీపు తిప్పింది.

"పోనీ, నేనే తినిపిస్తాను"

అని పళ్ళెం తీసుకుని ఆమె వీపునించి తిరిగి ఎదురుగా వెళ్ళి, ఒక ముక్క తుంచి ఆమె పెదిమకి అందివ్వబోతూ, దానిమ్మ మొగ్గవంటి లావణ్యాన్ని చూస్తూ నిలబడిపోయినాడు. ఆమె అతని వంక కోపంగా చూస్తున్న సంగతి అతను గమనించుకోలేదు. చేతిని ఆమె పెదిమల దగ్గిరిగా జరిపినప్పుడు ఆమె ఒక్క విసురు విసిరింది. ఆ ముక్క ఎగిరి, సాంబమూర్తిగారి పటానికి తగిలింది. అతను నవ్వుతో

"నువ్వు తిని తీరాలి" అని మళ్ళీ ఇంకోముక్క తెచ్చి చప్పున తెల్లని పూలదండతో అందమైన ఆమె నల్లని జుట్టు ముడికింద మెడమీద చెయ్యేసి బలవంతంగా ఆమె పెదిమల్లోకి పెట్టాడు ఆ బాదుషాని. ఆమె నోరు తెరిచింది చప్పున. అతని వేళ్లు ఆమె నోట్లోకి పోయినాయి. కసుక్కున కొరికింది. కోపంగా కసిగా. రక్తం చిమ్మే తనవేళ్ళమీది గాట్లని బాధతో చూచుకునే అతన్ని పదపద తిట్టింది, తెలుగు గాని భాషలో. తిట్లు అనిమాత్రం తెలిసింది అతనికి.

"ఏమిటి? ఏమిటి? ఎందుకు?" అంటున్నాడు, పక్క అలమారులో వున్న అయొడిన్ పూసుకుంటూ.

తనమీద ద్వేషమా? లేక తాను అంత చనువు తీసుకుంటున్నం దుకా? ఎట్లా తెలీడం? తెలుగు రాదు ఆమెకి. ఇంకో భాష రాదు తనకి.

మరి వెళ్ళిపోదేం?

తన వేళ్ళు కొరకవలసిన పనేమొచ్చింది, తన గదిలోకి వచ్చి? తన విరోధులు చేసిన కుట్రా? తన మిత్రులు చేసిన హాస్యమా?

కథా నిలయం
133
శ్రీకాకుళం

"ఎందుకు కొరికావు? చూడు ఎంత గాయమో!"

అని ఆమె చంపల్ని పట్టుకున్నాడు. అతన్ని ఒక్క తోపుతోసి మీద వుమ్మేసింది.

అతను లాగి ఒక చెంపకాయకొట్టాడు. ఆమె చప్పున చతికిలపడ్డది.

"పో, ఇక్కణ్ణించి పో" అన్నాడు. అంత మాత్రం హిందీ తెలుసును అతనికి.

ఆమె లేచి బైటకి వెళ్ళింది. ఆమె ఎక్కడికి వెడుతుందో కని పెట్టాలని కండువా వేసుకుని లైట్లు ఆర్పి, స్లిప్పర్లు తొడుక్కొని బైలు దేరాడు. గది తాళం వెయ్యబోతోవుంటే ఆ వరండాలో మెట్లకేసి తొంగి చూస్తూ నుంచుంది ఆమె. "జావ్." అని పెద్ద కేక పెట్టాడు.

ఆమె చప్పున దగ్గిరికి వొచ్చి చేతులు పట్టుకుని చాలా జాలిగా భయంగా

"చిల్లాన" అంది.

అరవవద్దంటోంది అనుకున్నాడు.

"అయితే లోపలికి రా" అన్నాడు. ఆమె రాలేదు. చెయ్యి పట్టుకుని ఒక్క గుంజు గుంజాడు. ఆమె రాలేదు. ఇద్దరూ పెనుగులాడారు. ఆమెని లోపలికి ఒక్క గెంటు గెంటాడు. పక్క మేడమీది దీపం గదిలో పడు తుంది. ఆమె తలలో పూలు తెగిపోయినాయి. జుట్టు వూడింది. పమిట కిందికి వేళ్ళాడుతోంది. ఆమె జాకెటు వేసుకోలేదు. సన్నటి రవికమాత్రం వుంది. వూగే ఆమె రొమ్ము, పౌర్ణమినాడు సముద్రం పొంగి చదునై మెరిసే ఇసిక మీదికి దొర్లుతున్నట్టుగా వుంది. నున్నని, చక్కవంటి ఆమె పొట్టమీద. ఆమెని కావలించుకున్నాడు. ఒక్కసారి అమాంతం విరుచుకుని పడ్డాడు. దుర్గని పోగొట్టుకున్న అపజయభారం అతని మనసులో విజృం భించింది. ఈ వింతస్త్రీ ముందు దుర్గ ఎందుకు? ఆమె అతనంత పొడుగా వుంది. సన్నని పొడుగైన చేతుల్లో, గొప్ప ఆర్టిస్టుకి వుండే, కొనలు తేరిన

ఆ వేళ్ళలో చాలా బలం. అతన్ని తోసేస్తూవుంటే అతనికి గెలవగలనా అనే అనుమానంకూడా కలిగింది. పెనుగులాడి ఇద్దరూ దబేలున పడ్డారు. ఒకటే తిడుతోంది అతన్ని ఆ భాషలో, రెండు మూడు తెలుగు బూతులు కూడా కలిపి. అప్నాదేశ్‌లో తెలుగుపాటలంత అందంగా వినిపించాయి అతనికి ఆ బూతులు. వాళ్ళు పడ్డ చప్పుడికి కిందనున్న పంజాబీ ఇల్లాలు ఏమనుకుంటోందో, ఏం అల్లరి చేస్తుందో ననుకున్నాడు ఓ నిమిషం. వేళ్ల మళ్ళీ నెత్తురు కారి ఆమె బుగ్గలకి ఎర్రనిరంగు వేస్తున్నాయి, మళ్ళీ ఆమె ఎక్కడ కొరుకుతుందోనని భయం. ఇద్దరికీ చమటలు పోశాయి. ఆమె అరుస్తుందేమోనని కూడా ఆలోచించాడు. ఆ ఆయాసం లోనే చిక్కని చోటనల్లా ఆమె వొంటిని కసితో నలిపేశాడు. గతిలేక ఆమె మూటమల్లే ఐ పడుకుంది ముడుచుకుని. చంద్ర బ్లూఫిల్మ్ చూసింది గావు ననుకున్నాడు. ఫిల్ములో శశాంకుడి సెన్సార్ల భయంగాని, చక్రధర్ కేం? పైగా అతనికి పరిచారికలు లేరు; పోలీసు లున్నారు పూళ్లో. ఆమెని మూటగా మంచంమీదికి ఎత్తుకువెళ్ళాలని చూశాడు గాని ఆమె అతని గుండెలమీదతన్నిన తన్నుతో కళ్ళు మైకం కమ్మాయి. అప్పటికి ఆమె వొంటిమీద ఎంతమాత్రం చీరె పీలికలు నిలిచి వున్నాయో అతనికి కన పడటంలేదు. నిరాశతో వొగరుస్తూ ఎదురుగా కూచున్నాడు. అతని కోర్కె పూర్తిగా ఎగిరిపోయింది. అందుకని పనిలేని బూర్జువాల జాడ్యం రొమాన్సు అంటారు కమ్యూనిస్టులు. సమరం చాలించాడని ఆమె లేచింది. వెళ్ళడాని కని గుమ్మందాకా వెళ్ళింది. అతను కదిలే వోపికలేక ఆమె వంక చూస్తున్నాడు. గుమ్మం దగ్గర నుంచుని చీకట్లోనే చిరిగిపోయిన తన బట్టల వంక చూసుకుని కప్పుకోవాలని ప్రయత్నించింది. చక్రధర్ నీచు డైతే లైట్లు వేసును. అతను చూసినదల్లా ఆమె కష్టాన్ని. ఎట్లా వెడు తుంది పాపం రోడ్డువెంట లైట్లకింద అవస్తతో? మెల్లిగా లేచి తన ప్రత్యేకమైన ప్రియురాళ్ళకి బహుమానాలకై దాచివుంచిన చీరెని బీరువా లోంచి తీసి ఇచ్చి-

"కట్టుకో" అన్నాడు.

అది చాలా ఖరీదుగల షిఫ్పన్ చీరె. యుద్ధం తరవాత ఎంత ఖరీదు పెట్టినా దొరకనిది. స్త్రీలకి సహజంగానే చీర నాణెం తెలుసు. అందులో ఆ చీర విలువని కనిపెట్టడానికి ఏ కష్టమూ లేదు. పైగా ఆమె విలువగల చీరెల కలవాటుపడ్డ స్త్రీలాగా కనుపించింది. చిరునవ్వుతో చీర వంక చూస్తూ నుంచుంది. అతనిముందు కట్టుకోడానికి సిగ్గుపడుతుందని అతను గది ఆ చివరికి వెళ్ళి కిటికీలోంచి చూస్తూ నుంచున్నాడు రోడ్డు వంక. ఆమె వెళ్ళినట్టు తనకి ఎట్లా తెలుస్తుంది? కొంచెం తలతిప్పి చూస్తూనే వున్నాడు. ఎప్పుడు వెళ్ళిందో వెళ్ళిపోయింది. పెద్ద నిట్టూర్పు విడిచాడు మళ్ళీ తనకి ఎట్లా ఎక్కడ కనపడుతుంది? ఎక్కడ వుంటుంది? ఎవరు? అట్లానే అనిపిస్తుంది. అదృష్టం చాలా సమీపంలో వున్నపుడు కూడా తెలుసుకోలేరు. ఆమె నివాసం తన కాళ్ళకిందనేనని తెలుసుకోలేకపోయినాడు. ఆమె అందాన్ని తలుచుకుంటున్నాడు. ఆమెని మరిచిపోవడం కష్టం. మరిచిపోనంతవరకు దుర్గబోటి స్త్రీలని తెమ్పు కోవ డమూ కష్టమే.

అలసిపోయినాడు. ఆకలివేస్తోంది.

వెనకనుంచి అతని మెడ చుట్టూ చేతులు గట్టిగా బిగించి లాగింది. చచ్చాడు. కంఠం బిగుసుకుపోతోంది. తన వీపుని అనుకున్న రొమ్ము సౌఖ్యాన్ని అనుభవించనేలేదు. అంతలో వుంటుంది దేశకాల భేదం. కిర్ మని అరిచాడు. చంపేస్తుంది. తగిన శాస్తి జరిగింది. స్త్రీజాతి తన మీద కసి తీర్చుకుంటోంది. అతనిమీద ఆ రాత్రి. చక్రధర్ శృంగార చరిత్ర ఆ రాత్రితో అంతం.

చాప అనుకుని తిమింగలానికి వేశాడు గాలం. పెనగులాడుతో ఇద్దరూ వెనక్కి జరిగారు. మంచంగావును అడ్డం తగిలింది ఆమెకి. ఆగింది. నిస్సహాయుడైన చక్రధర్ మెడని వెనక్కివొంచి తన మొహాన్ని వొంచింది అతనిమీదికి. ఆ మధురమైన ఆమె శ్వాస కాలధూమ విషజ్వాల మల్లే తగిలింది అతని మొహానికి. కంఠం కొరికేస్తుందా? ఏమంటారు పొద్దున్నే మనుషులు: ఆమె పెదిమలు అతని పెదిమల్ని బలువుగాకసిగా.

ఆమె మీద అతని పెదిమలోనించి కోసుకుని అతని పళ్ళని తగిలాయి. నవ్వి; అతన్ని ఒక్క వూపు వూపి పక్క మీద పడేసి వెళ్ళిపోయింది చప్పుడు కాకుండా. ఒక్క నిముషం వూపిరి సద్దుకుని దూకాడు ఆమె వెనక. ఎక్కడో ఆమె ఇల్లు చూడాలి. పరుగున తలుపు దగ్గిరకి వెళ్ళి లాగాడు. బైట గొళ్ళెం.

ఆ రాత్రికి తిండిలేదు, ఆమె నిరాకరించిన ఫలహారాలు తప్ప. తెల్లారి దాసీది తలుపు తెరిచిందాకా ఖైదు.

మర్నాడంతా కలలో మల్లే తిరిగాడు. శుకస ప్తతిలోంచి ఓ కథా నాయిక ప్రాణం పోసుకుని తన కోసం వొచ్చింది. అంతా కలా? ఇంతకీ ఆమెకి తనమీద ఇష్టమా? జాలా? వుత్తతమాషా? సాయంత్రం ఇంటికి వొస్తున్నాడు. దుర్గ ఇంక తన ఇంటివైపు రాదు. తన భాగంకింద వున్న రాక్షసి అసలు రానీదు. వొచ్చినా ఇంక దుర్గ తనకెందుకు? అనుకుంటో మెట్లెక్కుతున్నాడు. కిటికీ వెనకనించి పెద్ద నవ్వు. ఈ ఇంటావిడకి ఎట్లా తెలిసింది? ఆమె రావడం వెళ్ళడం చూసిందిగావును. దీనికి బాగా బుద్ధి చెప్పాలి, భాటియాని రానీ. మర్యాదస్తుడు. తన ఇబ్బందిని అర్థం చేసుకుంటాడు. కాని ఆ నవ్వు ఎక్కడో విన్నాడు తాను. నిన్న రాత్రి ఆమెదా? దుర్గమల్లే ఆమా ఈ ఇంటామె స్నేహితురాలా?

స్నానంచేసి, అద్దంముందు జుట్టు దువ్వుకుంటూ వుండగా వొచ్చింది ఆమె నిన్న తను ఇచ్చిన చీరెని కట్టుకుని.

మర్నాటినించి హిందీ నేర్చుకోడం ప్రారంభించాడు. మామూలు పాఠాలు కాదు. కొన్ని మాటలకి, వాక్యాలుకి మాత్రమే హిందీ చెప్ప మంటాడు. కూచో, పడుకో, కావలించుకో, ముద్దు పెట్టుకో, చీరె చాలా అందంగా వుంది. నీ కళ్ళు నక్షత్రాల లాగు మెరుస్తున్నాయి. నీ అంత అందమైనది ప్రపంచంలో లేదు. మళ్ళీ ఎప్పుడు వొస్తావు? - ఇట్లా.

రోజూ కొత్త వాక్యాలూ మాటలూ రాసుకుని వొస్తాడు. కొన్ని హిందీ వాక్యాలు తప్పు తప్పులుగా తెలుగులిపిలో రాసుకుని అర్థాలు అడుగుతాడు.

చాలా రోజులనించి, మహతాబు, నౌబత్, మహబూబు, ఇట్లాంటి మాటలకి అర్థాలడుగుతున్నాడు చెప్పిన అర్థాలు అతనికి నచ్చలేదు. చివరికి 'మొహబత్' అని శ్రద్ధంగా రాసుకొచ్చి అర్థం తెలుసుకున్నాడు. అందుకనే ఆ రాత్రి ఆమె.

"హం తుంకో మహబత్ కర్తేహుం"

అనేప్పటికి అర్థమై మంచం మీది నించి ఓ దూకు దూకాడు.

ఆమె ఆశ్చర్యపడుతోంది. ఆమె అనేక సమయాల్లో సంతోషించి అతనితో అనే వాక్యమే అదీ. దానికి అతను పరధ్యానంగా "అచ్చా, అచ్చా" అంటున్నాడు. ఆ వాక్యానికి అర్థం తెలుసుకోవాలని. కాని ఆ మాట చాలా అసందర్భమైన సమయాల్లో అనడంవల్ల ఇన్నాళ్లూ రాసుకోలేదు. తప్పు మాటలకి అర్థాలడిగి, ఆ మాట-

మతలబ్ - అనుకున్నప్పుడు, తనని చాలా అర్థం చేసుకుంటున్నా నంటోంది అనుకున్నాడు.

మెహతాబ్ - అనుకున్నప్పుడు తాను వెన్నెలమల్లే ఉన్నానని పొగిడిందనీ, నవబత్ - అనుకున్నప్పుడు, తన కంఠం సన్నాయిమల్లే ఉంటుందంటోందనీ, మహబూబ్ - అనుకున్నప్పుడు, తనని సినీమా డైరక్టరంత గొప్పవాణ్ణి చేస్తానంటోందనీ అనుకుని పొంగిపోయినాడు. ఇవాళ నిజం అర్థమయ్యేప్పటికి ఒక్క దూకు దూకాడు. మంచంమీద నించి, నగ్నమైన ఆమె పరిష్వంగనంనించి.

ఆ వాక్యాన్నే ఇన్నాళ్ళూ "అచ్చా అచ్చా" అని ఇవాళ హటాత్తుగా అట్లా దూకిపోతే ఆమెకి కోపం వొచ్చింది. తనమీద విసుకుపుట్టి తప్పించుకునే ఎత్తు అనుకుంది కాని ఒక్క నిమిషంలో అతను పెద్దగా నవ్వుతున్నాడు. ఆమె ఒయ్యారంగా పక్కమీద నించి లేచింది. ఆ స్ప్రింగు పూపు ఆమె లేచే తీరుకి మెరుగు పెట్టింది రక్తపురంగు ఉత్తరీయాన్ని కప్పుకుని నవ్వుతో అతని దగ్గిరికి వెళ్ళి తీసుకొచ్చి కూచోపెట్టి "ఏమి టా హాస్యం?" అని అడిగింది.

"ఏం లేదు, ఆ మొహబత్‌ని చూస్తే నాకు చాలా భయం."

"ఇన్నాళ్ళూ నా మీద చాలా భయమే చూపుతున్నావుగా."

"నీకు నామీద మొహబత్ అని తెలీదు."

"ఫోనీ ప్యార్."

"అదైనాను."

"మరి ఏమనుకున్నావు?"

"ఇష్టం అనుకున్నాను. ఇట్లా బావుండలా ? ప్రేమ ప్రసక్తి ఎందుకు?"

"ఏం, ప్రేమ అంత ఘోరమా? ఐనా భేదమేముంది?"

"బోలెడు."

"ఏమిటి?"

"ఎమిటంటే అదో కథ.... పూర్వం...."

అంతవరకు తెలుగు హిందీ కలిపి ఎట్లాగో అర్థం చేసుకుంటో సంభాషణ సాగించారు. ఆమెకి కొంత తెలుగు వొచ్చు. ఇతని మల్లేనే ఆమె కూడా దాసీ ఆమెనించి తెలుగు పట్టుదలగా నేర్చుకుంటోంది.

"తక్కింది రేపు చెపుతాను" అన్నాడు ఆ రాత్రికి.

తెల్లారే లేచి ఓ అరటావుమీద కథ రాశాడు. దాన్ని మధ్యాన్నం హిందీ గురువుదగ్గిరికి తీసుకువెళ్ళి హిందీలో రాయమన్నాడు.

"ఎందుకు?"

"ఎందుకేమిటి? మన ఆంధ్రులకి మరీ సిగ్గులేదు. అన్ని హిందీ పుస్తకాలూ కథలు తెలుగులోకి తర్జుమా చేసుకుంటారు. మెచ్చుకుంటారు.

కానీ ఒక్క తెలుగుకథని హిందీవాళ్ళు వాళ్ళ భాషలో ప్రచురించారా? నేను ఆంధ్రమాతకి భాషాసేవ చేసి కీర్తిని సంపాయించి పెట్టదలచుకున్నాను" అన్నాడు.

ఆ కథ—

అది నా చిన్నతనం. బీదకుటుంబం మాది. కష్టపడి కాలేజీలో చదివిస్తున్నారు మావాళ్ళు. ఆమెని మొదట నాటకప్రదర్శనంలో చూశాను. చెలికత్తెలతో వొచ్చి ఠీవిగా కూచునివుంది. వొంటినిండా రవ్వలనగలు. ముందువరసలో వాళ్ళకి కూర్చీలు చాలకపోతే నేను అక్కడ గేటుదగ్గిర మనిషితో చెప్పి కుర్చీ తెప్పించాను. ఆ కృతజ్ఞతతో నన్ను పలకరించింది. నన్ను తన యింటికి పిలిచింది. అంత అందమైన ఐశ్వర్యవంతురాలు నన్ను రమ్మనడంతో భూమిమీద నడవడం మానేశాను. ఆమె ఆవూరి ఓ గొప్ప డాక్టరు భార్య కాని ఆమె స్వతంత్రం ఆమెది. నేను వెళ్ళినప్పుడు ఆమె నన్ను పక్కన కూచోపెట్టకుని బుజంమీద చెయ్యేసి బుజ్జగించింది. నా కామెమీద పెద్ద ఆరాధన కలిగింది. మా కాలేజిలో కృష్ణశాస్త్రి, చలం, నండూరి మా ప్రైవేటు గురువులు. నేను శాస్త్రిగారి గేయాలు, ఎంకి పాటల్ని, చలం కథల్ని ప్రతి శని ఆదివారాలూ ఆమెకి వినిపించాను. ఆమెమీద ప్రేమ అన్నాను. రెండేళ్ళు నవ్వుతో నన్ను దూరాన వుంచి ఆడుకుంది. బీదవాణ్నైన నా జేబుల్ని ఎప్పుడూ డబ్బుతో నింపి వుంచింది. చివరికి నా ప్రేమని ఇంక భరించలేనని మొరపెట్టి పెట్టి, ఆమె ప్రియుణ్ణయినాను. ఆనాటినుంచి మా మధ్య ఉన్నత ప్రేమ, పవిత్రపేమ, దివ్య ప్రణయం, శాశ్వత ఆత్మఐక్యం అనే మాటలే ఎక్కువ. పాత గురువుల్ని చలాన్ని, ఎంకిపాటల్ని బూతులనీ, అవినీతి అనీ ఖండించుకుని, సినిమా పాటల్ని ఆశ్రయించాము మా ప్రేమ దోహదానికి.

"ఆమబ్బు ఈమబ్బు"

"ప్రేమమయమే జగము"

"హాయిగా పాడుదునా"

"ప్రేమనగరమే, ప్రేమ సౌధమే, ప్రేమ పుష్పమే"

ప్రేమ హృదయమే....

ప్రియా మిలనకో జానా.

తేరే నయినోనే చోరి కియా.

ఇట్లాంటి పాటలు పాడుకునేవాళ్ళం. ఆమె ఎంత ప్రేమ చూపినా ఇంకా చాలదనేవాణ్ణి. ఆమెకోసం పెళ్ళి మానుకున్నాను.

త్వరలో ఆమె నేను బోధించిన పాటల ప్రకారం నన్ను ప్రేమించ సాగింది. మా సంబంధం సంగతి అందరికీ తెలుసు. ఆ పాటలు పాడుతో నన్ను వెంబడించింది. నన్ను ఇంటి నించి కదలనీదు. స్నేహితులు వాస్తే వాళ్ళతో మాట్లాడనీదు అట్టేసేపు. వాళ్ళతో బైటికి పోనీదు. రేడియో వింటున్నా, పేపరు చదువుకుంటున్నా రేడియో మూసేస్తుంది. పేపరు లాగేస్తుంది. తనవంకనే చూడమంటుంది. తనలోనే బతకమంటుంది. ఆ భర్తన్నా నాకు అడ్డపడి రక్షిస్తాడేమో ననుకుంటే ఆమె ఆటలకి ఆమెని వొదిలి చాలా ఏళ్ళయిందట ఆయన. నేనేం మాట్లాడినా ప్రేమసంగతి ఎత్తుతుంది. నన్ను ఒక్కక్షణం వొదలలేనంటుంది. రాత్రులు సరేసరి; నన్ను డాబామీద, తోటలోనో తనతో తిప్పుకుని,

"తీయని వెన్నెలరేయి

ఎడబాయని వెన్నెలహాయి"

అని పాడుతో గంతు లేస్తుంది. నే నెక్కడన్నా చూస్తూ వుంటే,

"తుమ్మెదా ఒకసారి మోమెత్తి చూడమని" అని పాడసాగింది.

పోనే బాగానన్నా పాడుతుందా అంటే ఆమె కంఠం ఎత్తితే పిచికలూ, కప్పలూ ఏడుపు మొదలు పెట్టినట్టుగా వుంటుంది.

అర్ధరాత్రి నిద్రపోతో వుండగా మధ్యలో "కాదుసుమా కల కాదు సుమా" అని పాడుతోవుంటుంది.

"జబు సే చలేగయే హై వో
జిందగీ జిందగీ నహీ" అంటుంది.

రాత్రులు ఆమె చేతులమధ్యనించి ఒత్తిగిలడానికి కూడా లేదు. అట్లా అయింది నా బతుకు. సినీమాకి వెడితే ఆమె ప్రక్కనే కూచుని, ఫిల్ముని నన్ను చూడనీక నన్ను తనకేసి చూడమంటుంది. ఆ కథానాయికితో కలిసి పాటలు పాడుతుంది సన్నగా నా చెవిలో. 'వాళ్ళకి ప్రేమ అంటే తెలీదు; నేనే ఐతేనా....' అంటుంది. ఇంటికివొచ్చాక రాత్రంతా నేనూ ఆమా, ఆ పాటలపుస్తకం చూస్తో ఆ డ్యూయెట్లన్నీ పాడాలి. ఆ ప్రేమ ఘట్టాలన్నీ నటించాలి. తెరమీద కనపరచని విషయాలు భావించుకుని వాటినీ అనుసరించాలి.

గతిలేక పారిపోయినాను; కాని ఏంలాభం? ఆమె మిత్రులు, ఆమె సంసారం పిల్చి బతుకుతున్నా కుటుంబాలవాళ్ళు నా వెంబడిపడి, "నువ్వు వొదిలివొచ్చినప్పటినించీ ఆమెకి నిద్రాహారాలులేవు; కృశించిపోతోంది. నమ్మించి, ప్రేమించి, ప్రమాణాలు చేసి ఇటా రావడం న్యాయమేనా?" అని నన్ను నిందించి లాక్కుపోయినారు. ఆమెనించి ఉత్తరాలు విరహగీతాలతో. ఆమెకి అకస్మాత్తుగా కవనంకూడా రావడం ప్రారంభించింది. అంతే ఇక నిలవలేక పెషావర్ పోయినాను ఒక్క ప్రియ మిత్రుడితో చెప్పి. ఆ వేళకి తిరిగి వొచ్చాను. ఆమె చచ్చిపోయిందని తెలిసింతరవాత ఆమె విల్లులో పదెకరాల పొలమూ ఇరవై వేల రూపాయలు రొఖ్ఖమూ రాసింది నాకు. దాంతోనే ఈ వ్యాపారం ప్రారంభించి బాగుపడ్డాను. కాని ఆనాటినించి ఈనాటివరకు ఎవరన్నా ప్రేమ అనేమాట ఎత్తితే పారిపోతాను. స్త్రీ పురుష సంబంధం ఎటువంటిదన్నా కానీ. దాంటో ప్రేమప్రసక్తి వొచ్చిందా నేను ఏ మాత్రం సహించలేను."

★